క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



లక్ష్మీపురం: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నూకవరపు నరసింహారావు దశమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు శ్రీకాంత్ ఆర్థిక సహకారంతో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ అధ్యక్షత వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి ప్రసాద్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, కాసు సాయమ్మ మున్సిపల్ స్కూల్ శికుర్, జలగం రామారావు మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయులు గొలుసు నాంచారమ్మ, మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, కమిటీ సభ్యులు సుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.

అబాకస్‌లో సత్తా చాటిన భాష్యం విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యూఢిల్లీలో ఈనెల 14,15వ తేదీల్లో జరిగిన ప్రపంచస్థాయి అబాకస్ పోటీల్లో 30 దేశాలకు చెందిన ఆరువేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. గుంటూరులోని యూసీమస్ అబాకస్ శిక్షణ సంస్థ తరపున పాల్గొన్న భాష్యం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. భాష్యం బ్లూమ్స్‌కు చెందిన బి. రేహశ్రీ జెడ్ కేటగిరీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ రన్నరప్‌గా నిలువగా, ఒకటో తరగతి విద్యార్థి కె. నాగ అద్వైత్, 3వ తరగతి విద్యార్థి ఎం. తనీష్ రెడ్డి, 2వ తరగతి విద్యార్థిని ఎస్. పర్ణిత అంతర్జాతీయ, జాతీయస్థాయిలో ప్రథమ రన్నరప్‌గా నిలిచారని పేర్కొన్నారు. మెయిన్ క్యాంపస్‌కు చెందిన టి.భువనేష్, టి. రోహిత ప్రియ తృతీయ బహుమతి అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు గణితశాస్త్రంలో రాణించాలని టీజేపీఎస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు గణితశాస్త్రంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి వి. సాధన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

లక్ష్మీపురం: అంబేడ్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేసి భారతజాతికి క్షమాపణ చెప్పాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. స్థానిక చాకలిగుంట కమ్యూనిస్టు బొమ్మల సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడారు.
రాజ్యాంగ ధర్మానికి పూర్తిగా విరుద్ధంగా నడుస్తున్న కేంద్ర మంత్రి అమిత్‌షాపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్యలు తీసుకోపోవటం దారుణమని ఖండించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, చిన్నపోతుల విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర ప్రధాన కార్యదర్శి చినపోతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు

తాగునీటి సరఫరాపై గరం.. గరం



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ కార్పొరేటర్లు



అంబేడ్కర్ చిత్రపటంతో నిరసన తెలుపుతున్న వార్డు డివిజన్ కార్పొరేటర్

- నెలన్నర రోజుల్లో రెండుసార్లు నిలిపివేతపై ప్రశ్నల వర్షం
- అనధికార ట్యాప్ కనెక్షన్‌లపై చర్చ
- సుదీర్ఘంగా సాగిన కౌన్సిల్ సమావేశం
- 28వ తేదీకి కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేసిన మేయర్ కావటి



మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శుక్రవారం అధ్యక్షతన జరిగింది. ఉదయం 10.40 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. మొత్తం 361 అంశాలలో సభ్యుల ప్రశ్నలు 99 కాగా..మిగిలినవి సభ్యుల ప్రతిపాదనలు, ప్రియాంబుల్స్ ఉన్నాయి. గుంటూరు నగరానికి పక్కనే కృష్ణా నది ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటిని అందించలేకపోతున్నారని, లీకుల పేరుతో నెలన్నర రోజుల్లో రెండు సార్లు అంతరాయం ఏర్పడిందని కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఇతర సభ్యులు అధికారులను నిలదీశారు. శుక్రవారం సాయంత్రం వరకు 25 ప్రశ్నలకు మాత్రమే చర్చ జరిగింది. మిగిలిన వాటిపై చర్చించేందుకు ఈ నెల 28వ తేదీకి కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు.

కరెంట్ సాకుగా చూపడం సిగ్గుచేటు

విజయవాడ నుంచి తాగునీటిని తక్కెళ్లపాడు తీసుకువచ్చే క్రమంలో ఎక్కడైనా కరెంట్ పోతే గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అడిగిన ప్రశ్నకు అధికారులు చెప్పిన సమాధానంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరైన సమాధానం కాదని... ఫేక్ సమాధానాలు ఎందుకు ఇస్తారంటూ ? అధికారులను నిలదీశారు. నగరంలో అనధికార ట్యాపులు అధికంగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో తాగునీరు నిరంతరం వస్తోందని సభ్యులు ధ్వజమెత్తారు. మరికొన్ని ప్రాంతాల్లో అరగంట మాత్రమే వస్తుందని, అర్ధరాత్రులు నీరు వదులుతున్నారని తెలిపారు. వాటర్ సోర్స్ ఉన్నప్పటికీ రెండు గంటలు కూడా నీటిని ఇవ్వకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సిటీలో అనధికార ట్యాపులు ఉన్నాయని, కేవీపీ కాలనీలో 165 అనధికార ట్యాపులను తొలగించామని తెలిపారు. గుంటూరు నగరానికి విజయవాడ నుంచి 142 ఎంఎల్‌డీ వాటర్ వస్తుందని, ఆ నీరంతా ఎటు పోతుందో అర్థంకావడం లేదన్నారు. దీన్ని స్ట్రీమ్ లైన్ చేసి తాగునీటి సరఫరాను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి టూ టౌన్‌కి ప్రత్యేకంగా పైపులైన్ వేశారని, నెహ్రూనగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నించారు. దీనికి స్థానికుల నుంచి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని ప్రజాప్రతినిధులతో కలిసి పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం ఇంకా ఎంత కాలం సాగదీస్తారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రశ్నకు జనవరి నాటికి పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని కమిషనర్ చెప్పారు.

45 రోజులకొకసారి కౌన్సిల్ పెట్టాలి : మేయర్ కావటి

గత కౌన్సిల్ సమావేశంలో నెల రోజులకొకసారి కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని సభ్యులందరూ తీర్మానించినప్పటికి నాలుగు నెలలు గడిచిన తరువాత పెట్టడంపై కార్పొరేటర్లు అచ్చాల వెంకట రెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ, షేక్ రోషన్, ఇతర కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. 45 రోజులకొకసారి కౌన్సిల్ నిర్వహించాలని తీర్మానించినప్పటికీ ఎందుకు పెట్టలేదని మేయర్ కావటి మనోహర్‌నాయుడు ప్రశ్నించారు. వరదల కారణంగా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం పెట్టి చర్చించాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు లేఖ రాసినప్పటికి అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇక నుంచి నెల రోజులు కాగానే సభ్యులు ప్రశ్నలు, ప్రతిపాదనలు సెక్రటరీకి అందజేస్తే 15 రోజుల్లో అధికారులు దీనికి సంబంధించి సమాధానాలు తయారు చేసుకుని కౌన్సిల్ నిర్వహించాలని ఆదేశించారు.

ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తాం: కమిషనర్

ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు, ఇతర సిబ్బందికి అంతర్గత బదిలీ నిర్వహించి, అవినీతికి తావులేకుండా చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియజేశారు. ఖాళీ స్థలాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని దీనికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నకు అధికారులు ఇచ్చిన సమాధానంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.

కౌన్సిల్‌కు క్యారేజీలు తెచ్చుకుంటాం

సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేసే ప్రక్రియలో అధికారులు విఫలం చెందారు. కనీసం అన్నం పెట్టడం లేదని, ప్లేట్లు లేవని, మహిళల వెయిటింగ్ రూమ్ అధ్వానంగా ఉందని కార్పొరేటర్ కనక దుర్గ అధికారులను నిలదీశారు. మరో కార్పొరేటర్ మర్రి అంజలి మాట్లాడుతూ సభ్యులకు భోజనాలే సక్రమంగా పెట్టకపోతే ఎలా... ఈసారి నుంచి కౌన్సిల్‌కు ఇంటి నుంచే క్యారేజీలు తెచ్చుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు అన్నం లేకపోవడంతో వారు ఏడ్చుకుంటూ వెళ్లిపోయారు.

కూటమి నేతల ఓవర్ యాక్షన్

కౌన్సిల్ సమావేశంలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై వైఎస్సార్‌సీపీ సభ్యులు కొ అధికారులును ప్రశ్నిస్తున్న క్రమంలో టీడీపీ శ్రేణులు ఓవర్ యాక్షన్ చేశారు. ఒకానొక సందర్భంలో టీడీపీ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ అతిగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు మానసిక స్థితి బాగోలేదేమో ఆసుపత్రిలో చూపించుకోండని వెటకారంగా మాట్లాడటంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడ్డాయి.మేయర్ కావటి వాఖ్యలను రికార్డ్స్ నుంచి తొలగించాలని ఆదేశించారు.

అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్, ఇతర సభ్యులు అంబేడ్కర్ ఫోటోతో నిరసన తెలియజేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు అయిన తామంతా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే ఎన్నికయ్యామని.. ఆయనపై అమిత్‌షా వ్యాఖ్యలు సిగ్గుచేటని ఖండించారు.

నగదు చెల్లింపులతోనే రేషన్ మాఫియాకు అడ్డుకట్ట

గుంటూరు మెడికల్: ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రేషన్ బియ్యం మాఫియాను అరికట్టాలంటే కార్డుదారులకు ఎంత లబ్ధి చేకూరుతుందో అంత మొత్తం నగదు రూపేణా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగవిఠల్ కోరారు. నగదు చెల్లించడం ద్వారా రేషన్ బియ్యం మాఫియాను అరికట్టవచ్చని సూచించారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధర తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్ష్మీపురం: ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్ పేట 8వ లైన్‌కు చెందిన కొల్లపూడి ప్రసాద్ (59) శారదాకాలనీ 30వ లైన్‌లో బైక్ మెకానిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు.ఈనెల 13న షాపునకు బయలుదేరిన ప్రసాద్ మార్గంమధ్యలో కింద పడిపోయి చెవి నుంచి రక్తం కారుతూ, వాంతులు చేసుకున్నాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రసాద్ శుక్రవారం అక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

లక్ష్మీపురం: సూపర్ మార్కెట్‌లో పనికి వెళ్లి ఓ మహిళ తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బొంగరాల బీడు 2వ లైన్ ప్రాంతానికి చెందిన గొర్రెముచ్చు నాగమణి అదే ప్రాంతంలో ఉన్న సూపర్ మార్కెట్‌లో పని చేస్తోంది. గురువారం ఉదయం 7.30 గంటలకు పనికి వెళ్లిన నాగమణి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో భర్త శౌరిబాబు వెతికినా కనిపించక పోవడంతో శక్రవారం సాయంత్రం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు





వేడుకల్లో చిన్నారులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శాంతాక్లాజ్, దైవదూతల వేషధారణలో క్రీస్తు జననం రూపకాన్ని ప్రదర్శించారు. సత్తెనపల్లికి చెందిన వెస్ట్ బెర్రీస్ పాస్టర్ విలియం కేరీ క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జి. కొండారెడ్డి, జి. జనార్దన్‌రెడ్డి, సుశీల, శైలజ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుమేధ హైస్కూల్లో ..

ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శాంతాక్లాజ్, దైవదూతల వేషధారణలో అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదరణకర్త మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు సుబ్బారెడ్డి క్రీస్తు జననం, క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించి, ప్రార్థనలు చేశారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సకల జీవ మానవాళికి శాంతి, సమాధానం, క్షమాగుణం, ప్రేమను పంచేందుకు ఏసుక్రీస్తు జన్మించారని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులు క్రీస్తు జననం రూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా సీతారాముల పట్టాభిషేకం



నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రంలో 98వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలను విద్యాభారతి ఉపన్యాస సదనానికి తీసుకెళ్లారు. అనంతరం విష్వక్సేన ఆరాధన, కలశారాధన హోమం భక్తిశ్రద్ధలతో జరిగాయి. పంచామృతాలతో, సముద్ర, నదీ జలాలతో సీతారామ లక్ష్మణులకు అభిషేకాలు చేశారు. తిరుమంజన సేవ, వేదమంత్రాల నడుమ భక్తుల జై శ్రీరామ్ నాదంతో శ్రీరామచంద్ర పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పుల్లాభట్ల వెంకటేశ్వర్లు భక్త ప్రహ్లాద పురాణ కథ, కళారత్న బాపూజీ శ్రీకృష్ణ రాయబారం బుర్రకథ భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. కె.వెంకటాచలపతి బృందం (చెన్నై) సంకీర్తనలు ఆలపించింది. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం శ్రీపట్టాభిరాముని హనుమద్ వాహనంపై తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో శ్రీశృంగేరి పీఠపాలిత శ్రీసీతారామ సంకీర్తన సంఘం, శ్రీ రామనామ క్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, పోలిశెట్టి హరి ప్రసాదరావు, క్షేత్ర పాలకమండలి సభ్యులు శ్రీమాన్ క్రోసూరి మురళీకృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుల బృందం పాల్గొన్నారు.

అబాకస్‌తో విద్యార్థుల్లో పెరగనున్న సృజనాత్మకత



విద్యార్థులతో హరిత కోమలి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అబాకస్, మెంటల్ అర్థమెటిక్స్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టం (యూసీమస్) రాష్ట్ర సమన్వయకర్త మోతుకూరి శ్రీకాంత్ పేర్కొన్నారు. అబాకస్, మెంటల్ అర్థమెటిక్స్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో అమరావతి రోడ్డులోని జీకేస్ మ్యాజికల్ మాథ్స్ అకాడమీకి చెందిన ఎనిమది మంది విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సందర్భంగా శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ శ్రీకాంత్ మాట్లాడుతూ 30 దేశాల నుంచి ఆరువేల మంది పాల్గొన్న పోటీల్లో మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న విద్యార్థులు అధిక సంఖ్యలో అంతర్జాతీయ, జాతీయస్థాయి ర్యాంకులు సాధించారని వివరించారు. సరైన శిక్షణ ద్వారా మిగతా అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించి మేధో సంపన్న విద్యార్థులుగా రాణిస్తారని పేర్కొన్నారు. అకాడమీ డైరెక్టర్ పొత్తూరి హరిత కోమలి మాట్లాడుతూ జి.నేహంత్ రెండో రన్నరప్, జి.సహస్ర, ఎం లాస్య చౌదరి, షేక్ అయాన్, బి.ప్రతీక్, టి.భువనేష్, టి.రోహిత, జి.గమ్య తృతీయ రన్నరప్ సాధించి అకాడమీ స్థాయిని ఇనుమడింపచేశారని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, శిక్షకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆల్ ఇన్ ఒన్ గైడ్లు పంపిణీ



గైడ్లు పంపిణీ చేస్తున్న డీఈవో రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు శుక్రవారం బాపూజీ హైస్కూల్ 1979–80 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ ఒన్ గైడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో సీవీ రేణుక పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేసు బాల శ్రీనివాసరావు, కోశాధికారి తాడికొండ శేష వెంకట సత్యవరప్రసాద్, ఎన్‌టీఏ అధ్యక్షుడు బి. హైమారావు, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, పాఠశాల హెచ్ఎం ఎండీ ఖాసిం, ఎస్‌సీఎం సుభాని పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం 5వ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తి, ఏకాగ్రత, ధారణను పెంపొందించడంలో క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ జి. రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులకు స్నేహపూరిత వాతావరణంలో బోధన చేస్తున్నామని తెలిపారు. అనంతరం క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌కు నగరంపాలెం సీఐ

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ వీరానాయక్‌ను వీఆర్‌కు పిలిచినట్లు తెలుస్తోంది. తాడేపల్లిలో విధులు నిర్వహిస్తున్న సీఐని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు నియమించినట్లు విశ్వసనీయ సమాచారం.

శ్రీకృష్ణుని లీలలు మధురాతి 'మధుర'ం



నగరంపాలెం: శ్రీకృష్ణుని లీలలు మధురాతి మధురమని తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కల్యాణ వేదికపై ధనుర్మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం తిరుప్పావై ఐదోవ పాశురంలో శ్రీ కృష్ణుని ఆశ్చర్యకరమైన చేష్టలు, యమునా నది వైభవ విశేషాలపై డాక్టర్ కోగంటి వెంకటశ్రీరంగనాయకి ప్రవచనం చేశారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వెంకటశ్రీరంగనాయకి ప్రసంగిస్తూ మిక్కిలి ఆశ్చర్యకరమైన గుణాలు, చేష్టలను కలవాడు శ్రీకృష్ణుడని తెలిపారు.

23న జిల్లా కేంద్రాల్లో నిరసన

లక్ష్మీపురం: గతంలో ఢిల్లీ రైతాంగ పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు పరిచిన కేంద్ర ప్రభుత్వం వాటినే దొడ్డిదారిన వివిధ పేర్లతో తీసుకురావడం దుర్మార్గమైన ఆలోచన అని రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కొల్లి రంగారెడ్డి, కంచుమాటి అజయ్ ఖండించారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో శుక్రవారం అఖిలపక్ష రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేట్ పరం చేసేందుకు 'నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్' పేరుతో పెద్ద కుట్రతో నూతన చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు.
ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 23న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనతో పాటు ప్రతులను దగ్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, కంజుల విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.